సాక్షి ప్రకాశం

ఆదివారం । 12 । జనవరి । 2025



ఎస్పీ ప్రజా వేదిక రద్దు

ఒంగోలు టౌన్: భోగి సెలవు సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.



భక్తిశ్రద్ధలతో కూడారై ఉత్సవం

ఒంగోలు మెట్రో: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం జిల్లాలోని వైష్ణవాలయాల్లో కూడారై ఉత్సవం నిర్వహించారు. పలు ఆలయాల్లో 108 గంగాళాలతో పాయసాన్ని గోదాదేవికి నివేదించారు.

గరిష్టం/కనిష్టం
29/20

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఇద్దరు సీనియర్ సివిల్ జడ్జిలకు పదోన్నతి

ఒంగోలు: జిల్లాలో ఇద్దరు సీనియర్ సివిల్ జడ్జిలకు పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న జి.దీనా జిల్లా జడ్జిగా పదోన్నతి పొందారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కె.శ్యాంబాబు కూడా జిల్లా జడ్జిగా పదోన్నతి పొందారు. అయితే వీరికి హైకోర్టు రిజిస్ట్రార్ పోస్టింగ్‌లు కేటాయించాల్సి ఉంది.

నేడు స్వామి వివేకానంద జయంతి

ఒంగోలు సిటీ: జిల్లా యువజన సంక్షేమశాఖ, స్టెప్ ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వివేకానంద 162వ జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని కొత్తపట్నం బస్‌స్టాండ్ వద్ద స్వామి వివేకానంద విగ్రహానికి 12వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు పుష్పమాలాలంకరణ, సమావేశం నిర్వహించనున్నట్లు స్టెప్ సీఈఓ ఏ.శ్రీమన్నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి యువత, ప్రజానీకం విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు

ఒంగోలు: కరువదిలో రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలను ఈనెల 12 నుంచి నిర్వహిస్తున్నట్లు అఖిల భారత యువజన సమాఖ్య ప్రారంభం కానున్నాయి. మధ్యాహ్నం 3 గంటలకు ఒంగోలు మండల స్థాయిలో ముగ్గుల పోటీలు, సాయంత్రం 6 గంటలకు ఒంగోలు మండల స్థాయిలో షటిల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భక్తుల భద్రత గాలికొదిలేసిన సర్కార్

- ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్



ఒంగోలు సిటీ: భక్తుల భద్రతను చంద్రబాబు సర్కార్ గాలికొదిలేసిందని ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ విమర్శించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ తిరుపతిలో తొక్కిసలాట చరిత్రలో ఎన్నడూ జరగలేదన్నారు. భక్తుల భద్రత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పట్టడం లేదన్నారు. పోలీసులంతా చంద్రబాబు పర్యటనలో నిమగ్నం అయ్యారన్నారు. పోలీసుల బలగాలన్నీ కుప్పంలో జరిగిన సీఎం చంద్రబాబు పర్యటనకు, బాలకృష్ణ ఢాకూ మహారాజ్ ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు వెళ్లాయని విమర్శించారు. సీఎంకు అధికార యంత్రాంగం పై పట్టులేకపోవడంతోనే ఈ సంఘటన జరిగిందన్నారు. చంద్రబాబు సీఎం అయిన ప్రతిసారీ పదుల సంఖ్యలో హిందువులు మృతి చెందుతున్నారని విమర్శించారు. సనాతన ధర్మం ప్రతినిధి అని చెప్పుకునే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎందుకు బాధ్యత వహించరన్నారు. పవన్ కళ్యాణ్ క్షమాపణలతో పోయిన ప్రాణాలు తిరిగి వస్తాయా అని విమర్శించారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో తిరుపతిలో ఒక్క తొక్కిసలాట సంఘటన జరిగిన దాఖలాలు లేవన్నారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేవదాయ శాఖామంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలని కోరారు. పవన్ కళ్యాణ్ పదేపదే మొసలి కన్నీరు కారుస్తున్నారని, ప్రభుత్వం నుంచి బయటకు వచ్చి మాట్లాడాలన్నారు.

ఖజానా శాఖ నూతన కార్యవర్గం ఎంపిక

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ ఖజానా శాఖ నూతన అధ్యక్షునిగా కె.ఎలీషా రాణి, కార్యదర్శిగా పీవీ నారాయణ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్థానిక ఉప ఖజానా కార్యాలయంలో శనివారం ఎంపిక జరిగింది. ఎన్నికల అధికారిగా బి.శ్రీనివాసరావు వ్యవహరించారు. సహాధ్యక్షుడిగా జె.వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్.శ్రీనాథ్, కోశాధికారిగా ఎ.ఆంజనేయులు, ఉపాధ్యక్షునిగా యం.అస్మత్ బేగ్, పి.ముత్యం, ఎ.శ్రావణి కుమారి, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.మస్తాన్, జి.రమణ, డి.అంజలి ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఖజానా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రవి కుమార్, ప్రధాన కార్యదర్శి కాజా రాజ్ కుమార్, కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖాదర్, ఖజానా శాఖ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యం.వెంకటేశ్వర్లు అభినందించారు. ఖజానా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని నూతన కమిటీ నాయకులు తెలిపారు.

సంక్రాంతి..ధమాల్



ఒంగోలు గాంధీ రోడ్డు

సంక్రాంతి వస్తుంది ఇక బేరాలే బేరాలు.. ఈసారి దుకాణంలో ఏయే రకాలు సామానులు తెచ్చుకోవాలి.. ఖాతాదారులందరికీ అడిగిన వస్తువులు ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి అంటూ నెల రోజుల ముందు నుంచే కిరాణా, క్లాత్, బంగారం, స్టీల్, ఫర్నిచర్, ఎలక్ట్రానిక్స్ దుకాణదారులు హడావుడి మొదలెట్టేస్తారు. పోటీలు పడి సామానులు తెచ్చుకునేందుకు ఉత్సుకత చూపుతారు. ఇదంతా గత సంవత్సరం పరిస్థితి. నేడు మార్కెట్ అందుకు భిన్నంగా ఉంది. పేద, మధ్య తరగతి ప్రజల చేతుల్లో డబ్బులు లేకపోవడంతో సంక్రాంతి వ్యాపారం నేలచూపులు చూస్తోంది. ఒక వైపు నిత్యావసరాల ధరలు కొండెక్కడం.. మరో వైపు సంక్షేమ పథకాలు ఆగిపోవడంతో ప్రజల చూపు దుకాణాలకు దూరమైంది. నగదు రొటేషన్ గత ప్రభుత్వంలో ఎక్కువగా ఉండేది..ప్రస్తుతం నగదు రొటేషన్ లేకపోవడంతో వ్యాపార సముదాయాలన్నీ వెలవెలబోతున్నాయి.

- పెద్ద పండుగ వ్యాపారాలు డల్
- ఉసూరుమంటున్న వ్యాపారులు
- గతంతో పోలిస్తే 35 శాతం మాత్రమే బంగారం, వెండి అమ్మకాలు
- వస్త్ర దుకాణాల్లో 40 శాతం తగ్గిన కొనుగోళ్లు
- కళతప్పిన ఫర్నిచర్ మాల్స్
- పెరిగిన నిత్యావసరాల ధరలు
- భారంగా పిండి వంటల తయారీ
- సామాన్య, మధ్య తరగతి ప్రజల వద్ద డబ్బులు లేకపోవడమే కారణమంటున్న వ్యాపారులు

ఒంగోలు సిటీ/సింగరాయకొండ/మార్కాపురం:


ఉమ్మడి ప్రకాశం జిల్లా వస్త్ర వ్యాపారానికి పెట్టింది పేరు. మొత్తంగా ఐదు వేల వరకూ దుకాణాలు ఉంటాయి. నిత్యం రూ.కోట్లలో టర్నోవర్ ఉంటుంది. పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ వచ్చినా రెగ్యులర్ కస్టమర్స్‌తో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వస్త్ర దుకాణాల్లో సంక్రాంతి వ్యాపారం పోటాపోటీగా సాగేది. ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. సామాన్య, మధ్య తరగతి ప్రజల వద్ద డబ్బులు లేకపోవడంతో కొనుగోళ్లు భారీగా పడిపోయాయి. రోజుకి రూ.10 వేల వరకూ అమ్మే దుకాణంలో నేడు రూ.5 వేలు కూడా జరగడం లేదని వ్యాపారస్తులు వాపోతున్నారు. పండుగలకు, శుభకార్యాలకు వచ్చే రెగ్యులర్ కస్టమర్లు కూడా రావడం మానేశారని ఒంగోలు నగరంలోని ఓ వస్త్రవ్యాపారి వాపోతున్నారు. కొత్త సంవత్సరం ప్రారంభం కాగానే నగరంలోని గాంధీరోడ్డు కొనుగోలుదారులతో కిటకిటలాడిపోయేది. కనీసం నడిచి వెళ్లే పరిస్థితి కూడా ఉండేది కాదు. ఈ ఏడాది పండుగకు ఇంకా రెండు రోజులే ఉన్నా దుకాణాలు సందడి లేక వెలవెలబోతున్నాయి. సంక్రాంతి అంటే రైతు పండుగ. జిల్లాలో సుమారు 3 లక్షల మంది రైతులున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మిర్చి, పొగాకు, మినుము, పెసర, సజ్జ, వరి పంటలు భారీగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందకపోవడంతో పండక్కి డబ్బుల్లేక అన్నదాతలు దిగాలుగా ఉన్నారు.

సంక్షేమ పథకాలతో పెరిగిన కొనుగోలు శక్తి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేది. ఐదేళ్లపాటు క్రమం తప్పకుండా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రైతుభరోసా, అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, జగనన్న చేదోడు, విద్యార్థులకు వసతి దీవెన, విద్యా దీవెన, ఆటో డ్రైవర్లకు వైఎస్సార్ వాహన మిత్ర వంటి పథకాల ద్వారా నగదు పంపిణీ చేస్తూ సామాన్య, మధ్య తరగతి ప్రజలకు చేదోడుగా ఉండేవారు. గత ఐదేళ్లలో జిల్లాలో డీబీటీ కింద రూ.12,410.20 కోట్లు అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పథకాలన్నీ అటకెక్కాయి. అంతేకాక భారంగా పెరిగిన నిత్యావసర ధరలు, కరెంటు చార్జీలు, కూరగాయల ధరలు సామాన్య ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్నాయి. అంతేకాక నూతన మద్యం విధానంతో సంపాదించుకున్న కాస్త రూపాయి దానికే ఖర్చు చేస్తుండటంతో సామాన్య కుటుంబీకుల పరిస్థితి భారంగా మారింది.

35 శాతానికి పడిపోయిన పసిడి, వెండి అమ్మకాలు..

ఒంగోలు నగరంలో బంగారం, వెండి షాపులు మొత్తం 180 వరకు ఉన్నాయి. ఇందులో 40 పెద్ద షాపులు ఉండగా, 140 చిన్న షాపులు ఉన్నాయి. గత సంవత్సరంలో ఒక పెద్ద షాపులో నెలకు బంగారం 5 కేజీలు అంటే సుమారు రూ.3 కోట్ల 60 లక్షలు అమ్మకాలు జరగగా, వెండి 15 కేజీలు వరకు అంటే సుమారు రూ.13 లక్షల 80 వేలు వరకు కొనుగోళ్లు జరిగేయి. ప్రస్తుత సంవత్సరంలో పెద్ద షాపుల్లో కేజీన్నర బంగారం అంటే సుమారు రూ.ఒక కోటి ఎనిమిది లక్షలు, వెండి 2 కేజీలు సుమారు రూ ఒక లక్ష ఎనభై వేల రూపాయల మాత్రమే వ్యాపారం జరుగుతోందని బంగారు షాపుల యాజమానులు అంటున్నారు. అలాగే చిన్న షాపులకు సంబంధించి ఒక దుకాణంలో బంగారం అరకేజీ అంటే సుమారు రూ.36 లక్షల వ్యాపారం జరగ్గా, ప్రస్తుతం 150 గ్రాములు మాత్రమే వ్యాపారం జరిగిందని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంటే సుమారు రూ.10 లక్షల 80 వేలు మాత్రమే వ్యాపారం జరిగింది. వెండి వ్యాపారం గత సంవత్సరంలో 5 కేజీలు వ్యాపారం జరుగగా రూ.4 లక్షల 60 వేలు మాత్రమే, ప్రస్తుతం వెండి వ్యాపారం 2 కేజీలు అంటే రూ.ఒక లక్ష 84 వేలు మాత్రమే జరిగిందని వ్యాపారస్తులు అంటున్నారు. ప్రస్తుతం అద్దెలు కూడా వచ్చే పరిస్థితి లేదని వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారు.



డీబీటీ నిల్...

గడచిన ఐదేళ్ల నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డీబీటీ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేసేవారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దీనితో పేద ప్రజలు కూడా ఉన్నదాంట్లోనే సర్దుకుని పోతున్నారు. వేములకోట గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, మాబువలి తదితరులు మాట్లాడుతూ ఈ ఏడాది ఇంత వరకూ తమ అకౌంట్లలో ఎటువంటి నగదు జమకాలేదని దీనితో పండుగలను జరుపుకునేందుకు ఆసక్తి లేదని తెలిపారు.



30 శాతం కూడా అమ్ముడు పోలేదు

ఈ సంవత్సరం వ్యాపారాలు బాగా లేవు. పండుగ కోసమని అన్ని రకాల సామానులు తెచ్చిపెట్టాను. ఇప్పటికి 30 శాతం కూడా అమ్ముడు పోలేదు. పండుగ అయిపోగానే హోల్‌సేల్ వ్యాపారులు డబ్బుల కోసం వస్తారు. వారికి డబ్బులు ఏవిధంగా చెల్లించాలో అర్థం కావటం లేదు. గతంలో బయట అడుగు పెట్టడానికి కూడా తీరిక ఉండేది కాదు. కానీ నేడు అడపా దడపా తప్ప రోజంతా తీరిగ్గానే ఉంది.

– సీహెచ్ రామారావు, కిరాణా వ్యాపారి, సింగరాయకొండ

వ్యాపారాలు లేవు

ఈ సంవత్సరం వస్త్ర వ్యాపారాలు బాగా లేవు. ప్రతి సంవత్సరం 10 రోజుల నుంచే దుకాణాలు రద్దీగా ఉండేవి. కానీ ఈరోజు నుంచి మాత్రమే కొంచెం రద్దీ పెరిగింది. కానీ ఈరెండు రోజుల్లో ఏం కొంటారు, ఏం అమ్ముతామో అర్థం కావటం లేదు.

– ఎస్ రమణ, వస్త్ర వ్యాపారి, టంగుటూరు

రైతుల ఇళ్లలో నిరాశా నిస్పృహలు



సంక్రాంతి అంటేనే రైతుల పండుగ. పంట ఇంటికి చేరి పిల్లా పాపలతో సంతోషంగా గడపాల్సిన పండుగ. జిల్లాలో అందుకు విరుద్ధంగా ఉంది పరిస్థితి. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేదు. ఎన్నికలకు ముందు రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి మొండి చేయి చూపారు. అతి వృష్టితో నష్ట పోయిన రైతు సోదరుల ఇళ్లల్లో నిరాశా నిస్పృహలు అలుముకున్నాయి. సంక్రాంతి పండుగ సంతోషం లేకుండా పోయింది.

– కే.వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

వస్త్ర దుకాణాల్లో కొనుగోళ్లు అంతంత మాత్రమే



మార్కాపురంలోని వస్త్ర దుకాణం

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో దాదాపు 5 వేల వరకూ చిన్నా, పెద్దా వస్త్ర దుకాణాలు ఉన్నాయి. ఒక్క చీరాలలోనే సుమారు 2 వేల వరకూ దుకాణాలు ఉంటాయి. ఒంగోలు పట్టణంలో మొత్తం చిన్నా, పెద్ద దుకాణాలు 500 వరకు ఉన్నాయి. అందులో షాపింగ్ మాల్ వంటి పెద్ద షాపులు 25 వరకు ఉన్నాయి. పెద్దవి 300, చిన్నవి 225 వరకు ఉన్నాయి. గత సంవత్సరం ఈ షాపుల్లో మొత్తం టర్నోవర్ సుమారుగా రూ. 5 కోట్లు ఉండేది. అయితే ఈ సంవత్సరం రూ.2.3 కోట్లు మాత్రమే టర్నోవర్ జరిగిందని అంటున్నారు బట్టల షాపుల యాజమానులు. 40 శాతం పైనే అమ్మకాలు పూర్తిగా తగ్గిపోయాయని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. చిన్న వ్యాపారస్తులు ఎక్కడా సంతోషంగా లేరని, ఇలాంటి పరిస్థితులు ఎదురైతే బట్టల షాపులు మూసివేసే పరిస్థితులు తప్పవని వ్యాపారస్తులు వాపోతున్నారు. మార్కాపురం పట్టణంలో సుమారు 50కిపైగా వస్త్ర దుకాణాలు ఉన్నాయి. మెయిన్ బజారు, రథం బజారు, నాయుడు వీధి, మున్సిపల్ ఏరియా, కంభం బస్టాండు ఏరియా తదితర ప్రాంతాల్లో హోల్‌సేల్‌తో పాటు రిటైల్ వస్త్ర దుకాణాలు ఉన్నాయి. సాధారణంగా ప్రతి ఏడాది దసరా, దీపావళి, క్రిస్మస్, నూతన సంవత్సరంతోపాటు సంక్రాంతి పండుగకు కూడా మంచి బిజినెస్ ఉంటుంది. ఈ సారి ఈ పండుగలు పూర్తిగా నిరాశను మిగిల్చాయి. షాపు రెంట్లు కట్టడం కూడా కష్టమైందని వస్త్ర దుకాణం యజమాని ప్రసాదరావు తెలిపారు.

కళ తప్పిన ఫర్నిచర్ మాల్స్..



ఒంగోలు పట్టణంలో మొత్తం 20 ఫర్నిచర్ షాపులు ఉన్నాయి. అందులో 5 పెద్దవి కాగా, 15 చిన్నవి ఉన్నాయి. ఇందులో ప్రతి సంవత్సరం వ్యాపారాలు బాగా తగ్గుతున్నవి. గత సంవత్సరం ఈ 20 షాపుల్లో సుమారు రూ.18 కోట్ల వ్యాపారం జరిగింది. 5 పెద్ద షాపుల్లో సుమారు రూ.9 కోట్ల వ్యాపారం జరిగింది. మిగిలిన రూ.9 కోట్ల వ్యాపారం 15 చిన్న ఫర్నిచర్ షాపుల్లో జరిగింది. అయితే ప్రస్తుత ఫర్నిచర్ షాపుల్లో వ్యాపారం సుమారు రూ.14 కోట్లు జరగగా, రూ.4 కోట్లు తగ్గింది. నగరంలో ఎలక్ట్రానిక్స్ దుకాణాలు చిన్నవి పెద్దది మొత్తం 35 వరకు ఉన్నాయి. వీటిల్లో టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్లు, ఏసీలు, ఫ్యాన్లు, గ్రైండర్లు ఇలా గత సంవత్సరం సుమారు రూ.300 కోట్ల వరకు వ్యాపారం జరిగింది. ఈ ఏడాది రూ.150 కోట్లకు అమ్మకాలు పడిపోయాయి.

యా అల్లా..ప్రజలకు సుఖ శాంతులు ప్రసాదించు

- ఇస్తిమాకు 1.20 లక్షల మంది ముస్లింలు హాజరు

ఒంగోలు టౌన్: యా అల్లా..దేశ ప్రజల మధ్య సోదర భావం పెంపొందించు, సామరస్య భావంతో కలిసి మెలిసి జీవించేలా చేయి, కులమతాలకతీతంగా అన్నీ వర్గాల ప్రజలకు సుఖశాంతులు ప్రసాదించు అంటూ ఢిల్లీ నిజాముద్దీన్ మర్కస్‌కు చెందిన మౌలానా ఫారుక్ సాహెబ్ దువా చేశారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో మూడు రోజులుగా జరుగుతున్న నెల్లూరు, ప్రకాశం జిల్లాల దీనీ ఇస్తిమా శనివారం ముగిసింది. చివరి రోజు దువా కోసం ఇరు జిల్లాల నుంచి తండోపతండాలుగా ముస్లింలు తరలిరావడంతో ఉత్తర బైపాస్‌లో మంగమ్మ కాలేజీ సెంటర్ నుంచి



ఇస్తిమాకు తరలివచ్చిన ముస్లింలు

మార్కెట్ యార్డు వరకు ఎటు చూసినా రద్దీ కనిపించింది. సుమారు 1.20 లక్షల మంది హాజరైనట్లు నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఐటీఐ కాలేజీలోని 25 ఎకరాలు కిటకిటలాడాయి. ఇస్తిమాకు తరలివచ్చే వారి కోసం మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలానా ఫారుక్ సాహెబ్ మాట్లాడుతూ నిరుపేదలు, అభాగ్యులు, అన్నార్తుల పట్ల దయ, జాలి చూపించాలని కోరారు. ప్రతి ఒక్కరూ భక్తిప్రపత్తులతో పాటుగా సమాజంపట్ల బాధ్యతతో మెలగాలని సూచించారు. సాటి మనిషిని ప్రేమించాలని, వర్గాలు, వర్ణాలకు అతీతంగా సమానంగా గౌరవించాలని చెప్పారు. చివరి రోజు ఇంకా సాలిక్ సాహెబ్, మౌలానా హారూన్, ముఫ్తీ అంజద్, నెల్లూరుకు చెందిన ముఫ్తీ వహాబ్ తదితరులు ధార్మిక ప్రసంగాలు చేశారు. ఇస్తిమా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ హమీద్ మొత్తం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ బందోబస్తును పర్యవేక్షించారు.

వైద్యులు పూర్తి సమయం విధులు నిర్వర్తించాల్సిందే

- అడిషనల్ డీఎంఈ డా.వెంకటేశ్వరరావు ఆదేశాలు

ఒంగోలు టౌన్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పని చేసే వైద్యులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వర్తించాలని, ఇందులో ఎవరికీ ఎలాంటి మినహాయింపులు లేవని అడిషనల్ డీఎంఈ డా.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో జరుగుతున్న జీఎస్ఎం పరీక్షల సందర్భంగా శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జీజీహెచ్‌ను సందర్శించి పలు విభాగాలను పరిశీలించారు. ఓపీ, సెంట్రల్ ల్యాబ్, ఐసీయూలను పరిశీలించి సిబ్బందిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఛాంబర్లో సమీక్ష నిర్వహించారు. రూ.10 లక్షలలోపు అవసరమైన వైద్య పరికరాలను ఎన్టీఆర్ వైద్యసేవ నిధుల నుంచి ఖర్చు పెట్టాలని ఆదేశించారు. మానవ వనరులను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. అవసరమైన వారందరికీ రక్తం అందుబాటులో ఉంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం స్వచ్ఛంద సంస్థలతో ఎంఓయూ చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.ఏడుకొండల రావు, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా.బాలాజీ నాయక్, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.నామినేని కిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డా.సుధాకర్ పాల్గొన్నారు.















పట్నం..పల్లెబాట

విద్య, ఉపాధి కోసం ఉన్న ఊరు వదిలి సుదూర ప్రాంతాలకు వెళ్లిన వారు సంక్రాంతి పర్వదినం సందర్భంగా స్వగ్రామాలకు బయలుదేరారు. సొంత ఊరిలో తల్లిదండ్రులు, బంధుమిత్రుల మధ్య పండుగ సంతోషంగా జరుపుకునేందుకు పల్లెబాట పట్టారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి స్వగ్రామాలకు వెళ్లేందుకు వచ్చిన ప్రయాణికులతో ఒంగోలు ఆర్టీసీ బస్టాండు కిక్కిరిసింది. జనం రద్దీతో సందడి వాతావరణం నెలకొంది.

– సాక్షి, ఒంగోలు





భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు

● సీపీఎం పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు

ఒంగోలు టౌన్: విద్యుత్ చార్జీలు పెంచబోమని కల్లబొల్లి కబుర్లు చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక ప్రజలపై విపరీతమైన విద్యుత్ చార్జీల భారం మోపినందుకు నిరసనగా ఈ నెల 13వ తేదీ భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దహనం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సీపీఎం సీనియర్ నాయకుడు పూనాటి ఆంజనేయులు అధ్యక్షత వహించగా, మాబు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచమని, ఇంకా తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు సీఎం అయిన తర్వాత 7 నెలలు కూడా తిరగకుండానే విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమని అన్నారు. ఇష్టం వచ్చినట్లు విద్యుత్ చార్జీలు పెంచిన కూటమి ప్రభుత్వం.. గత ప్రభుత్వంపై ఆ నెపం వేయడం సిగ్గుచేటన్నారు. ఎప్పుడో వాడుకున్న విద్యుత్‌కు ఇప్పుడు చార్జీలు చెల్లించడం అనే విధానాన్ని సీపీఎం పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు. ఈ విధానంలో అసలు చార్జీల కంటే గత చార్జీలే ఎక్కువగా ఉండటం ప్రభుత్వ మోసపూరిత విధానానికి నిదర్శనమన్నారు. ప్రజల కష్టాన్ని దోచి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకే విద్యుత్ చార్జీలు పెంచుతున్నారని మండిపడ్డారు. జిల్లా ప్రజలకు ఎలాంటి మేలు చేయకపోయినా రూ.78 కోట్ల మేరకు విద్యుత్ చార్జీల భారం మాత్రం వేశారంటూ ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా సంక్రాంతి పండుగ సందర్భంగా భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దహనం చేయాలని కోరారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు జిల్లాలోని 25 వేల హెక్టార్లలో మినుము, కంది పంటలను రైతులు నష్టపోయారని తెలిపారు. వరి, మిర్చి పంటలకు సైతం నష్టం వాటిల్లిందన్నారు. జిల్లాలో వరి ధాన్యానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు రూ.1300 నుంచి రూ.1400 మాత్రమే ఇస్తున్నారన్నారు. ప్రభుత్వ నిర్వాకంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తొలుత ఇటీవల కాలంలో ప్రజా ఉద్యమాలలో పనిచేస్తూ మరణించిన వారికి సంతాపం తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు సయ్యద్ హనీఫ్, జీవీ కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, డి.సోమయ్య, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లుకు మాజీ మంత్రి సురేష్ నివాళి



వెంకటేశ్వర్లు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సురేష్, డాక్టర్ వెంకయ్య, నాయకులు

పొన్నలూరు: మండలంలోని వెంకుపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ ముళ్లమూరి వెంకటేశ్వర్లు దశదిన కర్మకు శనివారం వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ హాజరై ఘనంగా నివాళులర్పించారు. పీడీసీసీబీ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, జేసీఎస్ కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, కాటా మాధవరావు, అనుమోలు ప్రసాద్, మన్నెం రవణయ్య, కూరపాటి లక్ష్మీనారాయణ, నవులూరి మధు, దావులూరి మాల్యాద్రి, చెన్నారెడ్డి సీతయ్య, మాదాల శ్రీను, చిడిపోతు రమేష్, కాటూరి రంగయ్య, కడియాల రవణయ్య, మార్తాల వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొని వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

5.35 కిలోల అల్ప్రాజోలం స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న అల్ప్రాజోలం మత్తు మందు తయారు చేసే సామగ్రి

ముండ్లమూరు (దర్శి): అల్ప్రాజోలం అనే మత్తు పదార్థంతో పాటు దాని తయారీకి ఉపయోగించే పరికరాలను తెలంగాణకు చెందిన ఎస్‌టీఎఫ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన ముండ్లమూరు మండలంలోని ఉమామహేశ్వరపురం అగ్రహారంలో శుక్రవారం రాత్రి జరిగింది. అద్దంకి-నార్కెట్‌పల్లి హైవేలోని మిర్యాలగూడ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, హైదరాబాద్‌కు చెందిన బిచ్చు వెంకటేశం, ప్రసాద్ గౌడ్‌ల వద్ద 700 గ్రాముల అల్ప్రాజోలం మత్తు పదార్థాన్ని పోలీసులు పట్టుకున్నారు. వారిని విచారించగా, ఉమామహేశ్వరపురం అగ్రహారానికి చెందిన వ్యక్తుల వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీంతో ఉమామహేశ్వరపురం అగ్రహారానికి వచ్చి కృష్ణచైతన్య అలియాస్ నాని, రాజశేఖరరెడ్డి అనే వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 5.35 కిలోల అల్ప్రాజోలంతో పాటు తయారీకి ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కృష్ణచైతన్య వినుకొండ మండలం పెద్దకంచర్ల గ్రామానికి చెందిన వ్యక్తి కాగా, రాజశేఖరరెడ్డి గుంటూరు జిల్లా ప్రత్తిపాడు గ్రామానికి చెందిన వ్యక్తి. కృష్ణచైతన్య చెల్లెలిని రాజశేఖర్ ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరిద్దరూ రెండు నెలలుగా గ్రామంలో కోళ్ల ఫారాల వద్ద కాపలా ఉంటున్నారు. అక్కడ ఉంటూ ముడి పదార్థాలు తెచ్చుకుని అల్ప్రాజోలం మత్తు మందు తయారు చేస్తున్నారు. ఈ మత్తు మందును కల్లు, సారాలో కలుపుతారు. తెలంగాణ రాష్ట్రంలో కల్లు ఎక్కువగా తాగుతారు కాబట్టి అక్కడికి సరఫరా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు.

ఓబన్న పోరాటం
స్ఫూర్తిదాయకం

● జయంతి కార్యక్రమంలో మంత్రి డోలా

ఒంగోలు అర్బన్: వడ్డే ఓబన్న గొప్ప పోరాట యోధుడని, అతని పోరాట ప్రతిమ స్ఫూర్తిదాయకమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం శుభపరిణామమన్నారు. శనివారం స్థానిక ప్రకాశం భవనంలో నిర్వహించిన ఓబన్న జయంతి కార్యక్రమంలో మంత్రితో పాటు జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు, మేయర్ సుజాత, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, టూరిజం బోర్డు చైర్మన్ బాలాజీ పాల్గొని ఓబన్న చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం డీఆర్‌ఓ ఓబులేసు అధ్యక్షతన నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ 1807వ సంవత్సరంలో నంద్యాల జిల్లా సంజామల మండలంలో నొస్సం గ్రామంలో ఓబన్న జన్మించారని తెలిపారు. అప్పట్లో తలారీగా పనిచేసినట్లు తెలిపారు. తలారీ వ్యవస్థపై బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాటాలు జరిపిన యోధుడని కీర్తించారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, బీసీ సంక్షేమ అధికారి అంజల, స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ, వడ్డెర సంఘ నాయకులు వల్లెపు రాఘవులు, కుంచాల వెంకటేశ్వర్లు, తన్నీరు ఆంజనేయులు, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి, జేసీ, ఎంపీ, తదితరులు

19న రెవెన్యూ అసోసియేషన్
జిల్లా కమిటీ ఎన్నికలు

ఒంగోలు అర్బన్: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) జిల్లా కమిటీ ఎన్నికలను ఈ నెల 19వ తేదీ నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి అయిన ఏపీఆర్ఎస్ఏ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సురేష్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని రెవెన్యూ భవన్‌లో ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నట్లు చెప్పారు. అదేరోజు నామినేషన్లు, స్క్రూటినీతో పాటు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో
కూడార్లై ఉత్సవాలు



ఒంగోలు సంతపేట షిరిడీ సాయిబాబా ఆలయంలో ఉపాలయంగా ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 108 గంగాళాలలో సిద్ధం చేసిన ప్రసాదాలు

ఒంగోలు మెట్రో: ధనుర్మాసం వేడుకల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న వైష్ణవాలయాల్లో కూడార్లై ఉత్సవాలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని పీవీఆర్ బాలికల హైస్కూల్ దగ్గర ఘడియారంవారివీధిలో ఉన్న సీతా సమేత అనంత కోదండరామస్వామి మందిరంలో వంశ పారంపర్య ధర్మకర్త ఘడియారం సుబ్బయ్య నిర్వహణలో ఆలయ అర్చకులు, స్థానిక మహిళా భక్తులు 108 గంగాళాలలో పాయసం ప్రసాదంగా గోదామాత తరపున శ్రీకృష్ణ పరమాత్మకు నివేదన చేశారు. ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు. అదేవిధంగా ఒంగోలు సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో, గాంధీరోడ్డు గుర్రంవారివీధిలోని అనంత కోదండ రామస్వామి దేవస్థానంలో, పప్పుబజారులోని సీతారామస్వామి మందిరంలో, దక్షిణం బజారులోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో, గద్దలగుంట ప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థానంలో, కేశవస్వామిపేటలోని ప్రసన్నచెన్నకేశవస్వామి దేవస్థానంలో, గాంధీ రోడ్డు గీతా మందిరంలో, లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహికంగా పాల్గొన్న మహిళలు కుడార్లై ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

కూడార్లై పాశుర విశిష్టతను వివరించిన పొన్నూరు...

ప్రపంచంలోని ప్రజలందరికీ సమానమైన ప్రేమను పంచే నీలమేఘశ్యాముడు శ్రీకృష్ణపరమాత్మ అని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. గాంధీరోడ్డులోని గీతామందిరంలో టీటీడీ ఆళ్వార్‌దివ్యప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరుప్పావై ప్రవచనంలో ఎంపీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు చేస్తున్న తిరుప్పావై ప్రవచనానికి తాను గత నాలుగు సంవత్సరాలుగా వస్తున్నట్లు తెలిపారు. అనంతరం తిరుప్పావై 27వ కూడార్లై పాశురం సారాంశాన్ని విన్నారు. పొన్నూరును ఎంపీ సత్కరించారు. ఎంపీని గీతామందిరం అధ్యక్షుడు తాతా శ్రీనివాసులు, భక్తబృందం సత్కరించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ అయినాబత్తిన ఘనశ్యాం, తాతా ప్రసాద్, రంగసాయి, బెల్లం సత్యనారాయణ, గీతామందిర భక్తబృందం, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆత్మీయ సమ్మేళనం


కొండ్రెడ్డి కుటుంబీకుల సమ్మేళనం

పీసీపల్లి: ఒకప్పుడు విద్యారంగంలో కనిగిరి తాలుకాలోనే మొదటి స్థానంలో ఉంది ఆ గ్రామం. ప్రతి ఇంట్లో ఒకరు ఉద్యోగం చేసేవారు. రాను రాను ఉద్యోగరీత్యా కొందరు.. బతుకుదెరువు నిమిత్తం కొందరు గ్రామం విడిచి పట్టణాల్లో స్థిరనివాసముంటున్నారు. అయితే ఏటా సంక్రాంతిని పురస్కరించుకొని కొండ్రెడ్డి కుటుంబీకులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించుకుంటున్నారు. అందులో భాగంగా శనివారం మండలంలోని బుడ్డారెడ్డిపల్లిలో కొండ్రెడ్డి కుటుంబీకులు కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కొండ్రెడ్డి కుటుంబ వంశవృక్షంతో పాటు ఆ కుటుంబంలో పేరెన్నికగన్న, వయోవృద్ధులను ఘనంగా సన్మానించారు. జాతీయ కవిగా గుర్తింపు పొందిన కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మరోక కవి కొండ్రెడ్డి నాగిరెడ్డిలు ఈ గ్రామానికి చెందిన వారే. వీరితో పాటు కొండ్రెడ్డి పెదరాములు, కొండ్రెడ్డి రామిరెడ్డిలను కూడా ఘనంగా సన్మానించారు. కొత్త తరం వారిని సభా వేదికపై పరిచయ కార్యక్రమం నిర్వహించారు. కొండ్రెడ్డి కుటుంబీకులు, బంధువులు దాదాపు 200 మంది కలిసి విందు చేశారు. డాక్టర్ కొండ్రెడ్డి చినపరెడ్డి, నాగేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డి, నాగేశ్వరరెడ్డి, రామకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

సిరుల పంట

- దానిమ్మ సాగులో రైతులకు లాభాలు
- పండ్ల తోటల సాగుకు ఆసక్తి చూపిస్తున్న రైతులు


గాయంవారిపల్లిలో సాగు చేసిన దానిమ్మ తోట

హనుమంతునిపాడు: పండ్ల తోటల సాగు మంచి లాభాలు వస్తుండటంతో రైతులు ఈ సాగు వైపు ఆసక్తి చూపిస్తున్నారు. మండలంలో దానిమ్మ, తైవాన్ జామ, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్స్ తోటలు 100 ఎకరాల్లో సాగులో ఉన్నాయి. మండలంలోని గాయంవారిపల్లి, మొరవారిపల్లి, నల్లగుండ్ల, ముక్కవారిపల్లి, తిమ్మారెడ్డిపల్లి, కిచ్చంపల్లి, కిష్టపల్లి గ్రామాల్లో ఈ ఏడాది తైవాన్ జామ సాగుతో పాటు దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్స్ సాగు చేశారు. దానిమ్మ కాయ సైజు నాణ్యతను బట్టి ధర ఉన్నట్లు రైతులు చెప్తున్నారు. మండలంలో ఎర్రనెలలు కావడంతో కాయ మంచి రంగు, తీపి సైజు కూడా వస్తుందని రైతులు చెప్తున్నారు. అయితే రామ చిలుకలు, అడవి పందులు, కోతుల బెడదకు తోటల చుట్టూ సోలార్ ఏర్పాటు చేస్తున్నారు. మండలంలో సాగు చేసిన కాయలు సైజు బాగుండటంతో కిలో రూ.150 వరకు పలుకుతున్నట్లు రైతులు చెబుతున్నారు. డ్రాగన్ ఫ్రూట్ సైతం కిలో సైజును బట్టి రూ.100 వరకు పలుకుతోంది. గాయంవారిపల్లిలో రైతు, విశ్రాంతి ఉపాధ్యాయుడు, గ్రామ సర్పంచ్ గాయం రామకృష్ణారెడ్డి 7 ఎకరాల్లో దానిమ్మ సాగు చేశారు. ప్రస్తుతం తోట మంచి కాపుకు వచ్చిందని, ధర బాగుంటే కాయలు కోస్తామని చెబుతున్నారు.


విరగకాసిన దానిమ్మ కాయలు

దిగుబడి బాగుంది

7 ఎకరాల్లో దానిమ్మ సాగు చేశాను. దాదాపు రూ.30 లక్షలు ఖర్చయింది. రెండున్నరేళ్ల క్రితం ప్రారంభించాను. ఈ ఏడాది దిగుబడి బాగుంది. కాయ ఇంకా సైజు రావాల్సి ఉంది. వ్యాపారులు వచ్చి అడుగుతున్నారు. పక్షులు, అడవి పందులు, కోతుల బెడద కొంచెం ఎక్కువగా ఉంది. మంచి ధర వస్తుందని అనుకుంటున్నాం.



గాయం రామకృష్ణారెడ్డి, సర్పంచ్

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస హోమాలు


హోమాల్లో పాల్గొన్న భక్తులు

మార్కాపురం టౌన్: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో గత 10 రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక పూజల్లో భాగంగా శనివారం మందిరంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణాన్ని ఎక్కువసార్లు చదివిన యక్కలి సరోజ, కనక సుబ్బులు, పేరం సీతారావమ్మకు వెండి కాయిన్స్‌ను బహూకరించారు. పీవీఎల్ఎన్ నాగరాజు, రామడుగు గోపి తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి పాయసం నివేదన

మార్కాపురం టౌన్: ధనుర్మాసం సందర్భంగా వైష్ణవ ఆలయాల్లో గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. శనివారం శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయం, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి, గుండ్లకమ్మ నదీ ఒడ్డున ఉన్న శ్రీ లక్ష్మి పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి కూడార్రై 27వ పాశురం విశేష పూజలను నిర్వహించారు. గోదాదేవి అమ్మవారికి 108 గంగాళలతో పాయసం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.



చెన్నకేశవ స్వామి, ఆలయంలో 108 గంగాళాలతో నైవేద్యం



నాటి స్కంథపురియే నేటి కందుకూరు

- అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన ఉలవపాడు మామిడికి ప్రత్యేక గుర్తింపు
- నారశింహ క్షేత్రాల్లో మేటిగా వెలుగొందుతున్న మాలకొండ లక్ష్మీనరశింహస్వామి దేవస్థానం
- వినోదానికి కేరాఫ్ అడ్రస్‌గా రామాయపట్నం, కరేడు సముద్ర తీర ప్రాంతాలు

కందుకూరు: నేటి కందుకూరుకు చారిత్రక ప్రాధాన్యత కూడా ఉండటం విశేషం. చరిత్రను బట్టి చూస్తే క్రీ.శ 3వ శతాబ్దంలో శాతవాహనుల పతనాంతరం ఇక్ష్వాకుల పాలన మొదలైంది. అప్పట్లో పాకనాడు అనే ప్రాంతం ఇక్ష్వాకుల పాలనలో ఉండేది. తరువాత క్రీ.శ 436–60 మధ్యలో ఈ పాకనాడులోనిదే కందుకూరు ప్రాంతం. ఆ తరువాత క్రీ.శ 468–80 5వ శతాబ్దానికి చెందిన నాటి పల్లవరాజు శివస్కంధవర్మ కాలంలో సైనిక శిబిరాలను స్కంథవారాలు అని పిలిచేవారు. శివస్కంధవర్మ దిగ్విజయయాత్రను కొనసాగిస్తూ నేటి కందుకూరు ప్రాంతంలో స్కంథవారాలను ఏర్పాటు చేసినట్లు చరిత్ర చెప్తుంది. అలా ఈ స్కంథవారమే తరువాత కాలంలో కందుకూరుగా మారిందని ప్రాచీన శాసనాల్లో పేర్కొని ఉంది. క్రీ.శ 9వ శతాబ్దం తూర్పు చాళుక్య రాజైన గుణగ విజయాదిత్యుని సేనాని పాండురంగడు బోయ విహార దేశాన్ని జయించినట్లు క్రీ.శ 930 నాటి బెజవాడ యుద్ధమల్లుని శాసనం తెలియజేస్తుంది. బోయ విహార దేశమంటే కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరు, కనిగిరి ప్రాంతాలు కలిసి ఉండేవి. పాండురంగడు ఈ ప్రదేశాలను జయించి పటిష్టమైన కోటను కందుకూరులో నిర్మించినట్లు చారిత్రక సాక్ష్యాలున్నాయి. ఇలా కొంత కాలం కాకతీయుల పాలనలో కందుకూరు ఉంది. తరువాత రెడ్డి రాజుల పాలనలోకి, ఆ తరువాత విజయనగరరాజుల పాలనలోకి వచ్చింది. క్రీ.శ 1515 శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయలు కందుకూరు ప్రాంతాన్ని విజయనగర సామ్రాజ్యంలో కలుపుకున్నాడు. అనంతరం 1643లో కందుకూరు సీమను గోల్కొండ నవాబులు ఆక్రమించారు. చివరికి 1759లో కందుకూరు సీమను ఈస్ట్ ఇండియా కంపెనీ స్వాధీనంలోకి వచ్చింది. ఆ తరువాత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక ఉద్యమైన ఉప్పు సత్యాగ్రహం ప్రచారంలో భాగంగా కందుకూరు అంకమ్మదేవాలయం వద్ద మహాత్మగాంధీ సభను నిర్వహించినట్లు చరిత్ర చెబుతోంది.


కందుకూరు పట్టణ వ్యూ

అనంతరం 1952లో ద్విసభ్య నియోజకవర్గంగా కందుకూరు నియోజకవర్గం ఏర్పాటైంది. 1957లో పూర్తి స్థాయి నియోజకవర్గంగా ఆవిర్భావం జరిగింది. నాడు నెల్లూరు జిల్లాలో ఉన్న కందుకూరును 1972లో ప్రకాశం జిల్లా ఏర్పాటు సందర్భంగా ప్రకాశం జిల్లాలో కలిపారు. పరిపాలనా సౌలభ్యం కోసం పార్లమెంట్ ప్రాతిపదికన చేపట్టిన జిల్లాల పునర్విభజనలో భాగంగా కందుకూరును తిరిగి నెల్లూరు జిల్లాలో భాగంగా చేశారు. సింగరాయకొండ పట్టణంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన వరాహలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం భక్తుల కొంగుబంగారమై వెలుగొందుతుంది. రాష్ట్రంలోనే ప్రముఖ నారశింహస్వామి దేవస్థానాల్లో ప్రముఖ నారశింహ దేవస్థానంగా గుర్తింపు పొందింది. స్వామివారిని దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని వేలాది మంది భక్తులు ఈ క్షేత్రానికి తరలివస్తుంటారు. అలాగే తీరప్రాంతంలో పాకల బీచ్ పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతూ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి సాధిస్తుంది. అలాగే ఆక్వా పరిశ్రమ పెద్ద ఎత్తున అభివృద్ధి చెంది నియోజకవర్గ అభివృద్ధిలో కీలకంగా మారింది.

నాటి కనక పట్నమే నేటి కనిగిరి

పూర్వ చారిత్రక యుగంలో కనిగిరి నియోజకవర్గానికి ప్రత్యేక చరిత్ర ఉంది. చరిత్రలో కనకపట్నంగా పేరొందిన ఈ ప్రాంతం కాలక్రమంలో కనిగిరిగా మారింది. కని అంటే ఏనుగు అని, గిరి అంటే కొండ అనే శబ్దాల ఆధారంగా కనిగిరి పేరువచ్చిందని చరిత్రకారుల అభిప్రాయం. శ్రీకృష్ణదేవరాయలు, కాటంరాజు వంటి రాజుల పానలకు సాక్ష్యాలుగా బురుజు, దేవాలలు, కోనేరు వంటివి చరిత్రకు సాక్ష్యంగా కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో కనిగిరి నియోజకవర్గం మొదట్లో కమ్యూనిస్టు ఉద్యమాలకు పురిటిగడ్డగా ఉండేది. గదర్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడైన దర్శి చెంచయ్య వంటి చరిత్రకారుడు కనిగిరి ప్రాంతానికి చెందినవారే కావడం గమనార్హం. ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోన సీఎస్‌పురం మండలం అంబవరం కొత్తపల్లి గ్రామంలో నెలకొని ఉంది. పుణ్యక్షేత్రంలో త్రిముఖ దుర్గాదేవి వెలిసి ఉండడం ప్రత్యేకత. అలాగే ప్రకృతి రమణీయతకు సాక్ష్యంగా జాలువారే జలపాతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఈ క్షేత్ర దర్శనానికి వస్తుంటారు.

కొంగుబంగారం దత్తాత్రేయుడు

లింగసముద్రం మండలం మొగిలిచర్ల గ్రామంలో వెలిసి ఉన్న దత్తాత్రేయస్వామి మందిరం భక్తుల పాలిట కొంగుబంగారమై వెలుగొందుతోంది. భక్తుల కోర్కెలను తీర్చే స్వామిగా, భక్త సులభుడుగా ప్రసిద్ధి గాంచారు. దత్తాత్రేయస్వామి మందిరాన్ని దర్శించుకుని రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. భక్తులకు సకల సౌకర్యాలను మందిరంలో ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ తెలిపారు. అలాగే స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం ప్రతి రోజూ ఉచిత అన్నప్రసాదం అందిస్తామని తెలిపారు. అలాగే స్వామివారి మందిరానికి వచ్చేందుకు కందుకూరు, కావలి నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం ఉన్నట్లు తెలిపారు. అలాగే సింగరాయకొండ నుంచి రైల్ సౌకర్యం కూడా ఉందని వివరించారు. స్వామివారి మందిరానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఆధునిక వైద్యంలో మేటి

పామూరు పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో గల మల్లిఖార్జునరెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ పట్టణంలో ప్రముఖ హాస్పిటల్‌గా గుర్తింపు పొందింది. రోగులకు మెరుగైన, అత్యాధునిక వైద్యం అందించడంలో పేరుగాంచింది. హాస్పిటల్ అధినేత డాక్టర్ మల్లిఖార్జునరెడ్డి మాట్లాడుతూ హాస్పిటల్‌లో అన్ని రకాల జబ్బులకు అత్యాధునిక వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా మోకాళ్ల నొప్పులకు ఫాస్మాథెరపిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. హాస్పిటల్‌లో ఎన్‌టీఆర్ వైద్యసేవ, ఈహెచ్ఎస్ కింద నగదు రహిత చికిత్స సౌకర్యం అందుబాటులో ఉందని వివరించారు.

పేదల డాక్టర్ అశోక్‌కుమార్ రెడ్డి

సింగరాయకొండ పట్టణంలోని శివరామిరెడ్డి హాస్పిటల్ డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి పేదల డాక్టర్‌గా పరిసర ప్రాంత ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. వైద్య విద్యలో ఎండీ (జనరల్ మెడిసిన్), ఎంబీఏ (హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్) పూర్తి చేసిన అశోక్‌కుమార్‌రెడ్డి గత 32 ఏళ్లుగా సింగరాయకొండలోని శివరామిరెడ్డి హాస్పిటల్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్నారు. హాస్పిటల్‌లో షుగరు, బీపీ, గుండె, ఊపిరితిత్తులు, లివరు, నరాలు, వివిధ రకాల జ్వరాలు, పాయిజనింగ్, తేలు, పాము కాటు వంటి అన్ని రకాల వ్యాధులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ప్రకాశం జిల్లాలోనే కాక నెల్లూరు, బాపట్ల, గుంటూరు జిల్లాలోనూ మంచి హస్తవాసి ఉన్న డాక్టర్‌గా గుర్తింపు పొందారు. అలాగే దివంగత నేత రాజశేఖర్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో రాజకీయాల్లోనూ విశేషంగా రాణిస్తున్నారు. కొండపి నియోజకవర్గంలో ప్రముఖ నాయకునిగా గుర్తింపు పొంది నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ పార్టీ బలోపేతం కోసం శ్రమించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలో పర్యటించి జిల్లా కమిటీలు, సిటీ కమిటీలను నియమించడం ద్వారా పార్టీ డాక్టర్స్ విభాగాన్ని బలోపేతం చేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. అలాగే పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉచిత వైద్యశిబిరాలు, రక్తదాన శిబిరాలు వంటివి నిర్వహిస్తూ పేదలకు ఎంతో అండగా నిలుస్తున్నారు.

ఉద్యోగ సాధనలో ప్రకాశిస్తున్న 'ప్రకాశం'

వెనుకబడిన ప్రాంతంలో ఏర్పాటైన ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నతమైన సాంకేతిక విద్యను అందించడంలో ముందంజలో నిలుస్తుంది. విద్య, ఉద్యోగాల సాధనలో అగ్రభాగాన నిలుస్తూ దినదినాభివృద్ధి చెందుతుంది. కాలేజీ గత చరిత్రే ఇందుకు నిదర్శనం. 2001లో కేవలం 120 ఇంజినీరింగ్‌లో సీట్లతో ప్రారంభమైన కాలేజీలో నేడు 540 ఇంజినీరింగ్ సీట్లతో అటానమస్ హోదా సాధించింది. ఇంజినీరింగ్‌తో పాటు ఎంసీఏ, ఎంబీఏ, ఎంటెక్ వంటి పీజీ కోర్సులతో పాటు డిప్లొమా కోర్సులను విద్యార్థులకు అందిస్తుంది. విద్యాబోధనలో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ, ప్రతి ఏడాది 100 శాతం సీట్ల భర్తీని సాధిస్తుంది. ఇంజినీరింగ్ డిగ్రీ పట్టాతో పాటు ఉద్యోగ సాధనే లక్ష్యంగా విద్యబోధన చేస్తూ విద్యార్థులతో పాటు, తల్లిదండ్రుల ప్రశంసలు అందుకుంటుందని కాలేజీ టెక్నికల్ డైరెక్టర్ విజయశ్రీనివాస్ తెలిపారు.

కార్పొరేట్ విద్యా కేంద్రం విద్యానికేతన్

సింగరాయకొండ పట్టణంలో నాణ్యమైన విద్యను అందించడంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిలుస్తోంది విద్యానికేతన్ హైస్కూల్. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యుత్తమ విద్యను అందిస్తూ మండలంలోని అగ్రగామి విద్యా సంస్థల పేరుపొందింది. తన విద్యా సంస్థల్లో విద్యేకాకుండా క్రీడలు, భరతనాట్యం, యోగ వంటి వాటిల్లోను ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ విద్యార్థులను శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చేసేందుకు ఎంతో కృషి చేస్తున్నామని స్కూల్ కరస్పాండెంట్ సైకం వెంకటేశ్వర్లు తెలిపారు. చెకుముకి వంటి టాలెంట్ టెస్టుల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిస్తూ ఎన్నో పతకాలు సాధించారని, కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పోటీల్లో వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ సాధించిన ఘనత ఈ పాఠశాలకే దక్కుతుందన్నారు. ప్రతి సంవత్సరం 50 మంది విద్యార్థులు 10వ తరగతిలో 500కు పైగా మార్కులు సాధించి రికార్డు సృష్టిస్తున్నారని, మండల స్థాయిలోనే కాక జిల్లాలోనే ప్రముఖ పాఠశాలగా గుర్తింపు పొందిందని తెలిపారు.

క్లుప్తంగా

వ్యాక్సినేషన్ సక్రమంగా నిర్వహించాలి



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు

జరుగుమల్లి(సింగరాయకొండ): గర్భిణులు, చిన్నారులకు వ్యాక్సినేషన్ సక్రమంగా నిర్వహించాలని డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సూచించారు. జరుగుమల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో జరుగుతున్న ఇమ్యూనైజేషన్, ఎన్‌సీడీసీడీ సర్వేను ఆయన స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. డాక్టర్ కావ్య, డాక్టర్ కావ్యశ్రీ, సూపర్‌వైజర్ కె. తిరుపతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల

కన్వీనర్ల నియామకం



మున్సిపాలిటీ కన్వీనర్‌గా షేక్ రఫీ



కందకూరు కన్వీనర్ వెంకట రమేష్‌బాబు



గుడ్లూరు కన్వీనర్ కాపులూరి కృష్ణ



లింగసముద్రం కన్వీనర్ చిన్న వెంకటేశ్వర్లురెడ్డి



వలేటివారిపాలెం కన్వీనర్ లక్ష్మీనరసింహం



ఉలవపాడు కన్వీనర్ నన్నం పోతురాజు

కందుకూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్టీ విభాగాల నియామకంలో భాగంగా కందుకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు నూతన కన్వీనర్లను పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు శనివారం అధికారికంగా మండల కన్వీనర్ల జాబితాను విడుదల చేశారు. వీరిలో కందుకూరు మున్సిపాలిటీ పార్టీ కన్వీనర్‌గా ప్రస్తుతం కన్వీనర్‌గా కొనసాగుతున్న షేక్ రఫీకి మరోసారి మున్సిపాలిటీ కన్వీనర్‌గా అవకాశం ఇచ్చారు. అలాగే కందుకూరు మండల కన్వీనర్‌గా పలుకూరు గ్రామానికి చెందిన ఈదర వెంకటరమేష్ బాబును నియమించారు. గుడ్లూరు మండల కన్వీనర్‌గా గతం నుంచి కొనసాగుతున్న కాపులూరి కృష్ణను మరోసారి మండల కన్వీనర్‌గా నియమితులయ్యారు. లింగసముద్రం మండల కన్వీనర్‌గా మండలంలోని తిమ్మారెడ్డిపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నోటి చిన్నవెంకటేశ్వర్లురెడ్డిని నియమించగా, వలేటివారిపాలెం మండల కన్వీనర్‌గా పోలినేనిపాలెం గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు అనుమోలు లక్ష్మీనరసింహం నియమితులయ్యారు. ఉలవపాడు మండల కన్వీనర్‌గా ప్రస్తుతం కన్వీనర్‌గా కొనసాగుతున్న వీరేపల్లి గ్రామానికి చెందిన నన్నం పోతురాజును కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు నూతనంగా నియమితులైన మండల కన్వీనర్లు మాట్లాడుతూ పార్టీ తమపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామని, మండల కన్వీనర్‌గా తమకు అవకాశం కల్పించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాకాని గోవర్ధన్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త బుర్రా మధుసూదన్‌యాదవ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

స్నేహితుని కుటుంబానికి అండగా..



శ్రీహరి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న స్నేహితులు

జరుగుమల్లి(సింగరాయకొండ): ప్రాణస్నేహితుని కుటుంబానికి కష్టం రావటంతో తోటి స్నేహితులంతా ఒక్కటై చేయిచేయి కలిపి రూ.65,100లను స్నేహితుని కుటుంబానికి అందజేశారు. ఈ సంఘటన మండలంలోని వావిలేటిపాడులో జరిగింది. వావిలేటిపాడు గ్రామానికి పాలేటి శ్రీహరి వెలుగొండ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సుమారు 25 ఏళ్ల క్రితం 1999–2000 బ్యాచ్‌లో 10వ తరగతి చదివాడు. ప్రస్తుతం హైదారాబాద్‌లో ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తుండగా ఇటీవల హఠాత్తుగా గుండెనొప్పి రావటంతో మృతి చెందాడు. ఇతనికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. శ్రీహరి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో విషయం తెలిసిన తోటి ప్రాణస్నేహితులు ఆర్థిక సహాయం అందజేసి చెక్కును భార్య రజనీకుమారికి అందజేసి స్నేహితుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్నేహితులు నారాయణమూర్తి, బాలసత్యం,ఆంజనేయులు, యరమాల రాకేష్‌శర్మ, కోటి, రమేష్, బాలకృష్ణ, తిరుపతిస్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాలకొండ ఆదాయం రూ.7,59,050

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండలో వెలసి ఉన్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం ఆదాయం శనివారం రూ.7,59,050 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సాగర్‌బాబు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.19,720, తలనీలాలు రూ.23,925, ప్రత్యేక దర్శనం రూ.1,86,300, లడ్డూ ప్రసాదాలు రూ.1,53,735.. అన్నదానం రూ.3,20,344, రూమ్ అద్దెలు రూ.20,750 వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఆలయ అధికారుల పర్యవేక్షణలో జరిగింది.

పేకాట జూదరుల అరెస్ట్

కందుకూరు రూరల్: పేకాట శిబిరంపై దాటి చేసి ఆరుగురు పేకాట జూదరులను అరెస్ట్ చేసినట్లు కందుకూరు రూరల్ ఎస్సై మహేంద్ర నాయక్ తెలిపారు. అందిన సమాచారం మండలంలోని పలుకూరు గ్రామంలో పేకాట శిబిరంపై మెరుపుదాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న ఆరు మోటార్ సైకిళ్లు, రూ.19,670 నగదు స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. వారిని కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై తెలిపారు.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

లింగసముద్రం: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ.. ఇతర కార్పొరేషన్ల ద్వారా జీవనోపాధి కల్పించడం కోసం మండలంలో మొత్తం 44 మందికి సబ్సిడీతో కూడిన రుణాలు బ్యాంకుల ద్వారా అందించేందుకు ఈ నెల 16వ తేదీ లోపల ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 30, చంద్రన్న స్వయం ఉపాధి ద్వారా 4, బీసీ.. ఈబీసీ కార్పొరేషన్ ద్వారా జనరల్ మెడికల్ షాపు కోసం ఒకటి, రెడ్డి ఒకటి, ఏపీ ఈబీసీ 2, కమ్మ కార్పొరేషన్ 2, రెడ్డి కార్పొరేషన్ 3, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఒకటి, బ్రాహ్మణ కార్పొరేషన్ ఒకటి కేటాయించినట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకునేవారు ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలతో పాటు పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటో.. ఫోన్ నంబర్‌తో సచివాలయం లేదా ఆన్‌లైన్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ చెప్పారు.

కోళ్ల పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

పొన్నలూరు: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అనుక్ శనివారం హెచ్చరించారు. కోడి పందాలతో పాటు పేకాట ఆడినా, అశ్లీల నృత్యాలు ప్రదర్శించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలకు పోలీసుల అనుమతి తప్పకుండా తీసుకోవాలని సూచించారు. పండుగ పేరుతో యువకులు గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, గొడవలు సృష్టించినా వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. పండుగను మంచి వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

కనిగిరిరూరల్: ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని విద్యుత్ ఈఈ ఏ వీరయ్య ప్రారంభించారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని యూనియన్ నాయకులు ఈఈకి అందచేశారు. కార్యక్రమంలో 1104 యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ హరికృష్ణా, కనిగిరి డివిజన్ అధ్యక్షుడు ఎల్ఎస్ఎస్ అనీల్‌కుమార్, పి.మల్లయ్య, జి. కృష్ణాకుమార్, జి.రమేష్, డి.శ్రీనివాసులు, ఎస్‌కే అబ్దుల్ కరీం, వెంకటరత్నం, నాగార్జున, శ్రవం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పొంగళ్లు


బాబా గుడిలో ప్రత్యేక పూజలు

కనిగిరిరూరల్: ధనుర్మాసం సందర్భంగా స్థానిక షిర్డీ సాయిబాబా దేవస్థానంలో గోదా రంగనాథ స్వామికి కూడారై పొంగళ్ల కార్యక్రమాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సామూహిక తిరుప్పా వై పాశురాలను చదివారు. అష్టోత్తర పూజలు చేశారు. శని త్రయోదశి సందర్భంగా ఆలయంలో నవగ్రాలకు తైలాభిషేకం, నవగ్రహ హోమాలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మ, వీసీ రామశాస్త్రీ, మండ్ల వెంకటేశ్వర్లు, ఏసీ చెంచులు, సాయి మహిళా సేవా బృందం పాల్గొన్నారు.

యాచకుడు మృతి


మృతదేహం వద్ద పోలీసులు

ఉలవపాడు: యాచకునిగా ఉంటున్న వ్యక్తి బస్‌షెల్టర్‌లో మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రామాయపట్నంలో జరిగింది. బస్‌షెల్టర్ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లి పరిశీలించారు. అతని వయస్సు సుమారు 50 ఏళ్లు ఉండవచ్చని గుర్తించారు. గత 9 ఏళ్లుగా రామాయపట్నంలోనే భిక్షాటన చేసేవాడని స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చిల్లచెట్లతో నిండి ఉన్న బలిజపాలెంలోని శ్మశానం


ప్రహరీ లేని మోపాడు అంబేడ్కర్ నగర్ శ్మశానం

తుది వీడ్కోలుకు అడ్డంకి

- అభివృద్ధికి నోచుకొని శ్మశానాలు
- చిల్ల చెట్లతో నిండి అడవిని తలపిస్తున్న వైనం
- కొన్ని శ్మశానాలకు వెళ్లే దారులు కూడా అధ్వానమే..

కందుకూరు రూరల్:

శ్మశానాల్లో ఆత్మలు ఘోషిస్తున్నారు. శ్మశానాల్లో చిల్ల చెట్లు, పిచ్చి కంపలతో లోపలకి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ఎవరైనా మరణిస్తే ఖననం చేసేందుకు బంధువులు నానా అవస్థలు పడుతున్నారు. చనిపోయినా వారికి ఆరడుగుల గుంట తీసేందుకు కూడా వీలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. శ్మశానాలు అభివృద్ధికి నోచోకోక ఇది శ్మశానమా... అడివా అన్నట్లుగా ఉంది పరిస్థితి.

కందుకూరు మండలంలోని పలు గ్రామాల్లోని శ్మశానాలు చిల్ల చెట్లు, పిచ్చి కంపలతో నిండి ఉన్నాయి. ఇవి అభివృద్ధికి నోచుకోవడం లేదు. శ్మశానాల్లో కొందరిని దహనసంస్కరణలు చేస్తారు. మరి కొందరిని పూడ్చిపెడతారు. ఇలా పూడ్చిన, దహనం చేసిన మృతదేహాలకు గుర్తుగా వారి బంధువులు సమాధులు నిర్మిస్తారు. మృతుల వర్ధంతి, జయంతి దినాల్లో, సంక్రాంతి పండుగల సమయాల్లో సమాధుల వద్దకు వెళ్లి పూజలు చేసుకొని, ఫలహారాలు పంచుకుంటుంటారు. ఇలా కొందరు అనవాయితీగా చేస్తున్నారు. కానీ ఇవి చేసుకునేందుకు కూడా వీలు లేకుండా శ్మశానాలు ఉన్నాయి. శ్మశానంలోకి వెళ్లేందుకూ వీలులేనందగా అధ్వానంగా శ్మశాలు తయారయ్యాయి. బలిజపాలెం గ్రామానికి చెందిన


కందుకూరుకు సమీపంలో ఉన్న మహదేవపురం శ్మశానం

శ్మశానం చుట్టూ ప్రహరీ నిర్మించినప్పటికీ లోపల మాత్రం చిల్ల చెట్లు, పిచ్చి మొక్కలు చిట్టడవిని తలపిస్తోంది. చిల్ల చెట్లు ఏపుగా పెరిగాయి. శ్మశానానికి వెళ్లే దారిలో కూడా చెత్తచెదారం వేసి ఉంది. అదే విధంగా మోపాడు అంబేడ్కర్‌కు చెందిన శ్మశానం గ్రామానికి సమీపంలోనే ఉంటుంది. అయితే గ్రామంలో ఎవరైనా మృతి చెందితే ఈ శ్మశానంలోనే దహన సంస్కరణలు నిర్వహిస్తారు. శ్మశానికి చుట్టూ వరి పొలాలు ఉన్నాయి. ప్రహరీ లేకపోవడంతో మృతదేహం ఖననం చేసే సమయంలో కనిపిస్తుండడంతో ప్రజలు, మహిళలు, పిల్లలు భయాందోళన చెందుతున్నారు. శ్మశానం చుట్టూ ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు విన్నవిస్తున్నారు. అదే విధంగా చుట్టూ ఉన్న పొలాల వారు శ్మశాన స్థలాన్ని అక్రమిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ప్రహరీ నిర్మిస్తే అక్రమణలు కూడా అరికట్టినట్లు ఉంటుందన్నారు. మహదేవపురం పంచాయతీలోని మూడు శ్మశానాలు బయటకు బాగానే కనిపిస్తున్నప్పటికీ లోపల చిల్ల చెట్లతో అధ్వానంగా ఉన్నాయి. అదే విధంగా పందలపాడు గ్రామానికి ప్రత్యేకంగా శ్మశానం లేదు. ఊరు పక్కన ఉన్న పాలేరు నది ఒడ్డునే దహన సంస్కరణలు చేస్తుంటారు. కర్మకాండలు చేయాలంటే ప్రత్యేకంగా షెల్టర్లు కూడా లేవు. చెట్ల కింద లేదా షామియానాలు ఏర్పాటు చేసుకోవాలి. పాలేరు నదిలో నీరు లేకపోతే ప్రత్యేకంగా ట్యాకర్లలో నీటిని ఏర్పాటు చేసుకొని కర్మకాండలు జరుపుకుంటారు. ఈ గ్రామంలో ఏళ్ల తరబడి ఇలానే జరుగుతున్నాయి. శ్మశానాలు లేకపోవడంతోపాటు ఉన్న శ్మశానాలు కూడా సక్రమంగా లేకపోవడంతో మృతి చెందిన వారికి సమాధులు నిర్మించుకోవాలనే బంధువులు ఆశలు నిరాశవుతున్నాయి. సొంత స్థలాలు, పొలాలు ఉన్న వారు అక్కడి ఖననం చేసి సమాధులు నిర్మించుకుంటున్నారు. లేని వాళ్లు మాత్రం నిరాశతో దహన సంస్కరణలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి శ్మశానాలు అభివృద్ధి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్రీడలతో ఏకాగ్రత పెంపు


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రకాశం, రంగనాయకులరెడ్డి, మోహన్‌రెడ్డి


ఉత్సాహంగా సాగుతున్న కబడ్డీ పోటీలు

కనిగిరిరూరల్: యువతలో పట్టుదల, ఏకాగ్రత పెంపొందించేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్‌ల కృషి అభినందనీయమని సీఐ ఎస్‌కే ఖాజావలి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య, అఖిల భారత యువజన సమాఖ్యల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కబడ్డీ పోటీలను సీఐ ఎస్‌కే ఖాజావలి, సీపీఐ జిల్లా, నియోజకవర్గ నాయకుడు వై రవీంద్రబాబు, సయ్యద్ యాసీన్, జీపీ రామారావు, పందిటి మోహన్, న్యాయవాది షాహిద్ ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. పీసీపల్లి ఎంఈఓ జి.సంజీవి మాట్లాడుతూ క్రీడలు యువత, విద్యార్థుల్లో దేహ దారుఢ్యాన్ని, ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. సీఐ ఎస్‌కే ఖాజావలి కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కబడ్డీ పోటీలను వీక్షించేందుకు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పుట్టా సుబ్బారావు, సీహెచ్ పవన్ కళ్యాణ్, ఎస్‌కే నజీముద్దీన్, సయ్యద్ ఇఫ్రాజ్, గూడూరి సురేష్, గణేష్, గుజ్జుల బాలిరెడ్డి, ఎస్‌కే ఖాశింపీరా, మహిళా నాయకురాలు అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: క్రీడలు యువత, విద్యార్థుల్లో ఐక్యతను, పట్టుదలను పెంపొందిస్తాయని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. మండలంలోని చాకిరాలలో చాకిరాల యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలను ఎంపీపీ దంతులూరి ప్రకాశం, మాజీ వైస్ ఎంపీపీ సానికొమ్ము రంగనాయకుల రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సూరసాని మోహన్‌రెడ్డిలు ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ ప్రకాశం, రంగనాయకుల రెడ్డి, మోహన్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. బల్లిపల్లి, తురకపల్లి జట్ల మధ్య జరుగుతున్న తొలి మ్యాచ్ టాస్‌ను రంగనాయకులరెడ్డి వేశారు. చాకిరాల యూత్ నాయకులు విశాల్, ఎబినేజర్, నయీమ్, అవినాష్‌ల ఆధ్వర్యంలో ఉత్సాహభరిత వాతావరణంలో క్రికెట్ పోటీలు సాగాయి. పల్లె ప్రాంతంలో క్రీడలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. సర్పంచ్ అరవిందా లూకా, దంతులూరి కరుణాకర్, వెంకటయ్య, దావీదు, బాలకృష్ణారెడ్డి, వెంకీ, లక్ష్మీ నారాయణ, మోరా శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ ఎస్‌కే ఖాజావలి


కనిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు

కనిగిరిరూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జె.ఉషారాణి సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో కళాశాల కో ఆర్డినేటర్ డి జయకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రకాశంలో సంక్రాంతి సంబరాలు

కందుకూరు: ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీలో ముందస్తు సంక్రాంతి సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఆనవాయితీగా వచ్చే కాలేజీ సిబ్బందికి నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమాన్ని కాలేజీ యాజమాన్యం చేపట్టింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సిబ్బందిని గౌరవించడం తమ కుటుంబ సంప్రదాయమని, కాలేజీ అభివృద్ధి, ప్రగతికి సిబ్బంది అంకితభావంతో కీలక భూమికి పోషిస్తున్నారని చెప్పారు. టెక్నికల్ డైరెక్టర్ కె. విజయశ్రీనివాస్ మాట్లాడుతూ తమ కాలేజీ సిబ్బందిని కుటుంబ సభ్యులుగా చూసే విధంగా యాజమాన్యం వ్యవహరిస్తుందన్నారు. సిబ్బందికి ఆరోగ్య బీమా, సుకన్య సమృద్ధి యోజన వంటి సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ప్రకాశం కాలేజీ యాజమాన్యం వృత్తి అవసరాలతో పాటు వ్యక్తిగత అవసరాలను కూడా తీరుస్తుందని వివరించారు. కార్యక్రమంలో కాలేజీ ఆర్అండ్‌డీ డీన్ డాక్టర్ ఎం. లక్ష్మణరావు, వైస్ ప్రిన్సిపాల్ హరిబాబు, బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందికి వస్త్రాలు పంపిణీ చేస్తున్న రామయ్య

వడ్డే ఓబన్నకు ఘన నివాళి

సీఎస్‌పురం(పామూరు): స్వాతంత్య్ర సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను సీఎస్‌పురంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక సర్పంచ్ శ్రీరాం పద్మావతి, డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు పలువురు ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా స్వాతంత్ర్యోద్యమంలో ఆయన పోరాట పటిమను వివరించారు. మన్నేపల్లి శ్రీనివాసులు, డి.తిరుపతయ్య, బి.వి.రమణయ్య, బి.వెంకటాద్రి పలువురు పాల్గొన్నారు.


ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆలయానికి వెండి ఆభరణాల అందజేత


తిరుమలనాథస్వామి విగ్రహమూర్తులకు వెండి ఆభరణాలు అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని అయ్యలూరివారిపల్లె తిరుమలనాథకొండ ప్రముఖ పుణ్యక్షేత్రంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీతిరుమలనాథస్వామి మూల విగ్రహమూర్తులకు గ్రామానికి చెందిన దాతలు వెండి ఆభరణాలు సమకూర్చారు. శనివారం జరిగిన కార్యక్రమంలో దాతలు పాలుగుళ్ల తిరుపతిరెడ్డి రమణమ్మ దంపతులు, ప్రశాంత్‌రెడ్డి వెంకటమాధవి దంపతులు స్వామికి వెండి కిరీటాలు, హస్తం, శంఖుచక్ర పద్మ హస్తాలను ఆలయ అర్చకులు రామమూర్తికి అందజేశారు. దాతలు సమర్పించిన ఆభరణాలకు అర్చకులు విశిష్ట పూజలు చేశారు. కార్యక్రమంలో పునుగోడు శ్రీనివాసులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు


కంబాలదిన్నె అంగన్‌వాడీలో ముందస్తు సంక్రాంతి వేడుకలు


వగ్గంపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో భోగిమంట

పామూరు: మండల కేంద్రమైన పామూరుతో పాటు మండలంలోని కంబాలదిన్నె, వగ్గంపల్లె ఎస్టీకాలనీ, పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గోళ్ల పద్మజ, ఎంవీఎస్.పార్వతిల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో వేసిన ముగ్గులు అలరించాయి. విద్యార్థులు హరిదాసు వేషధారణతో పాటు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గాలిపటాలు ఎగురవేశారు. కార్యకర్తలు భాగ్యలక్ష్మి, గీత, రామాంజమ్మ, ఎల్.దేవి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కంబాలదిన్నె అంగన్‌వాడీ కేంద్రంలో హరిదాసు వేషధారణలో చిన్నారి

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

కనిగిరిరూరల్: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 3వ వార్డు, పాత శంఖవరం ప్రాంతాల్లో శనివారం చైర్మన్ గఫార్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను చైర్మన్‌కు విన్నవించారు. మున్సిపల్ స్థలాలను ఆక్రమించి నీటి పారుదలను అడ్డుకుంటే చర్యలు తప్పవన్నారు. తక్షణం సమస్య పరిష్కరించాలని మున్సిపల్, సచివాలయ సిబ్బందిని చైర్మన్ గఫార్ ఆదేశించారు. ప్రభుత్వ, గ్రామ కంఠ, మున్సిపల్ స్థలాలను ఎవరు ఆక్రమించినా ఉపేక్షించేది లేదన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, సచివాలయ సిబ్బంది శ్రవంతి, రత్తయ్య, స్థానికులు జిల్లెల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వార్డులో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

హెల్త్ వెల్‌నెస్ సెంటర్ తనిఖీ

కొండపి: మండలంలోని కొండపి-1 హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి టి.వెంకటేశ్వర్లు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. గర్భిణులకు 12 వారాలకు ముందు నమోదు చేయాలన్నారు. అనంతరం సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో జరుగుతున్న పరీక్షల వివరాలను తెలుసుకొని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం తాటాకులపాలెంలో జరుగుతున్న టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేసి కార్యక్రమం వివరాలు అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. అనంతరం పెట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రాథమిక కేంద్రంలోని వార్డులను, ల్యాబ్, ఆపరేషన్ రూం, ఫార్మసీ రూం, వ్యాక్సిన్ నిల్వ ఉంచే గదిని తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో సదుపాయాలు మెరుగుపరచాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో పెట్లూరు వైద్యురాలు డాక్టర్ అనూష, ఎంపీహెచ్ఓ ఎం రవిబాబు, హెల్త్ సూపర్‌వైజర్ కేఎల్ లక్ష్మీనారాయణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


పెట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు

ఉలవపాడులో చోరీ

- 1.80 వేల సొత్తు అపహరణ

ఉలవపాడు: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు తాళాలు పగలగొట్టి ఇంటిలో చోరీ చేసిన సంఘటన మండల కేంద్రమైన ఉలవపాడులో జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం మధ్యలో ఈ సంఘటన జరిగింది. కొత్తూరుకు చెందిన ఏకొల్లు ఉమామహేశ్వరి తన మనుమడి వివాహ కార్యక్రమం సందర్భంగా విజయవాడ వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి మెయిన్ డోర్ తాళం పగులగొట్టి ఇంటిలోనికి ప్రవేశించి బంగారు, వెండివస్తువులను దొంగిలించారు. వీటి విలువ సుమారు 1లక్ష 80 వేలు ఉంటుందని బాధితురాలు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్సై అంకమ్మ చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ పిలిపించి దొంగతనం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

కులగణనతోనే సామాజిక న్యాయం

కందుకూరు: రాష్ట్రంలో కులగణన చేపట్టాలని, కులగణనతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి కొండా వెంకటశివయ్య అన్నారు. బీసీ ఐక్యవేదిక సమావేశం శనివారం స్థానిక కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణనతోనే బీసీలకు సామాజిక న్యాయం జరుగుతుందని, రాజ్యాంగ పరమైన రక్షణ లభిస్తుందని తెలిపారు. రజక ఉద్యోగుల సంఘం నాయకులు కల్లగుంట మోహన్‌రావు మాట్లాడుతూ కులగణన ఒక ఎక్సరేలాంటిదని దీని వల్ల ఏ సామాజిక వర్గం ప్రజలు ఎంత మంది ఉన్నారో తెలుస్తుందన్నారు. పరిపాలనలో, నిధుల పంపిణీలో సామాజిక న్యాయం జరుగుతుందని తెలిపారు. అలాగే ఫిబ్రవరి 8వ తేదీన కులగణనపై కందుకూరు పట్టణంలో సదస్సు నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో నూర్ బాషా ఉత్సవాల సంఘ నాయకులు షేక్ అబ్దుల్లా, షేక్ మధు, నయీబ్రాహ్మణ ఉద్యోగ సంఘ నాయకులు కరేటి వెంకటేశ్వర్లు, కుమ్మరి శాలివాహన ఉద్యోగ సంఘ నాయకులు ఎం. కొండయ్య, ద్రోణాదుల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కొండా వెంకటశివయ్య

హవ్వ.. చెప్పలతో కొబ్బరికాయ కొట్టడమా!


చెప్పలతో కొబ్బరికాయలు కొడుతున్న కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

- ఎమ్మెల్యే తీరుపై విమర్శలు

ఉలవపాడు: కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చెప్పులు వేసుకుని కొబ్బరి కాయలు కొట్టడంపై సొంతపార్టీ నాయకులే ఇదేంటి ఇలా చేశారని గుసగుసలాడుతున్నారు. శనివారం మండల పరిధిలోని చాకిచర్ల గ్రామంలో మినీ గోకులం ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి చెప్పులు వేసుకునే దేవుడికి, నూతన గోకులానికి కొబ్బరి కాయలు కొట్టారు. గోకులం అభివృద్ధి చెందాలని కోరుకుని చెప్పులు విప్పి కొడితే బాగుండేదని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం చాకిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.